# "బాల శిక్ష"

## వి. మోహన కుమార్




సాయంత్రం అయిదున్నర

సెయింట్ డాన్లీ ప్రోజ్, పోయెట్రీ నాండిటెయిల్డ్ ఎండ్ గ్రామర్ స్కూల్.

"ఎలా ఉంది ఛాన్స్" జగన్ ఆతృతగా అడిగాడు.

"రేపు ఇంటర్వ్యూ ఉందికదా అయిన తర్వాత తెలుస్తుంది. ఛాన్స్ సంగతి ఎవరికీ తెలియదు. మెరిట్ మీద ఆధారపడి ఉంటుంది అంటోంది మదర్" అక్కడ పని చేస్తున్న ఒకావిడ చెప్పింది.

"ఇంటర్వ్యూలో ఏం అడుగుతారు" జగన్ నెమ్మదిగా అడిగాడు.

ఆవిడ నోరు తెరిచి ఏదో చెప్పబోయింది. ఇంతలో 'మేరీ' అని ఓ పెద్ద కేక వినిపించింది.

"మదర్ పిలుస్తోంది. చూపిందంటే బాగుండదు" అని వెళ్ళబోయింది మేరీ.

"ఒక్క నిమిషం" అన్నాడు జగన్. మేరీ ఆగలేదు. వడివడిగా అడుగులు ముందుకేసింది. "ఆలస్యం అయితే ఆవిడ గదిలోంచి బయటికి వస్తుంది" అని అతని వైపు చూడకుండా పరుగున ఆ సౌధంలోకి వెళ్ళింది. ఆవిడ్ని వెంబడించాలనుకున్నాడు జగన్-అడుగు ముందుకు వెయ్యబోయి వివేకం మేల్కొనడంతో ఆ కోరికను అరికట్టుకుని ఆగిపోయాడు. అతికష్టం మీద గేటు దగ్గర కాపలా అతనికి నచ్చచెప్పి దుర్భేద్యమైన ఆ ప్రహరీ హద్దుని దాటి లోపలికి వచ్చాడు. ఇప్పుడు మదర్ చూసి కన్నెర్ర చేసిందంటే తన శ్రద్ధ తిప్పలు వృధా.

రాత్రి రెండుగంటలకి లేచి స్కూలు కొచ్చి రాత్రి తెల్లవార్లు అక్కడ పడిగాపులు కాసి, ఉదయం పదిన్నర వరకు క్యూలో నిలబడి అప్లికేషన్ ఫారం సంపాదించుకున్న అవస్థ గుర్తొచ్చింది. తన స్నేహితుడి భార్య స్నేహితురాలు ఆ స్కూల్లో పనిచేస్తోందని తెలుసుకుని ఓక రికమండేషన్ లెటర్ తీసుకుని ఆవిడ్ని కలవడానికి వచ్చాడు, ఒక మాటకూడా మాట్లాడకముందే ఇలా జరిగింది. ఆవిడ అక్కడే హాస్టల్లో ఉంటుందిట.

ఆవిడ్ని కలవడం ఎలా?

ఇంకాసేపు అక్కడే నిలబడితే చీకటి పడుతుంది. తననక్కడ ఉండనివ్వరు. అంతదాకా ఎందుకు ఓ అయిదు నిమిషాలు

తను అక్కడ నిలబడివుంటే చాలు ఆ కాపలా అతను వచ్చి బయటికి నడవమంటాడు. అతని కన్నుకప్పడం ఎలా ?

వొక్క క్షణం ఆలోచించాడు. దుస్సాహసం చేసి పూర్తిగా పాడు చేసుకోడం కన్నా ఇంటికి తిరుగుతోవపట్టడం మంచిది అనుకున్నాడు.

వాయంత్రం చల్లబడుతోంది. అక్కడ చర్చి గోపురాలమీద పావురాళ్ళు గుంపులు గుంపులుగా వాలుతున్నాయి. కావు కావు మంటూ కాకులు చెట్లమీద తమ గూళ్ళని చేరుకుంటున్నాయి.

జగన్ గేటు దగ్గరికి వచ్చి స్కూటరెక్కాడు.

రేపే ఇంటర్వ్యూ. వొకటి కాదు. రెండు ఇంటర్వ్యూలు.

తలుచుకున్న జయంతికి గుబులుగా ఉంది.

మూడేళ్ళ దీప ఓ బొమ్మల పుస్తకాన్ని ముందేసుకుని దాంతో కుస్తీ పడుతోంది. గేటు బయట పిల్లలు ఆడుకుంటున్నారు. అక్కడికి వెళ్ళాలని దీప కుతూహలపడుతోంది. ఆమె మనసు వాళ్ళమీద ఉంది.

"డాడీ వచ్చే టైం అయింది. నేను కాఫీ కలుపుతాను. వంటిట్లోకి పోదాం". జయంతి లేచింది. వంటిట్లోకి వెళ్ళింది.

గేటు బయట పిల్లలు పెద్దగా అరుస్తూ పరుగెడుతున్నారు. దీప పుస్తకం వదలి లేచి వింటుంది. నెమ్మదిగా కిటికీ దగ్గరకెళ్ళి అక్కడున్న కుర్చీ ఎక్కి కిటికీలోంచి బయటికి చూసింది. చూస్తున్కొద్దీ ఆ పిల్లల్ని ఇంకా చూడాలనిపిస్తోంది. ఎగిరి అక్కడ వాలాలనిపిస్తోంది.

"దీపా రా" వంటింట్లోంచి అమ్మ గొంతు వినిపించింది.

"అమ్మ పెద్దది. ఆటుకోనివ్వదు" అనుకుంది. నత్యంతటం లేక వంటింట్లోకి వెళ్ళింది.

కాలింగ్ బెల్ మోగింది.


జగన్ వచ్చాడు. జయంతి తలుపు తీసింది.

జగన్ లోపలికి వచ్చి కుర్చీలో కూర్చున్నాడు. జయంతి కాఫీ ఇచ్చింది.

"కలిసిందా" అడిగింది జయంతి.

"ఆ" అన్నాడు జగన్

"చెప్పిందా"



ఇతనెవరో నీటికొరువు ప్రాంతంనుండి వచ్చినట్టున్నాడు సార్! స్విమింగ్ పూల్ నీళ్లంతా చుక్క మిగల్చకుండా తాగేశాడు!!

"ఎక్కువ మాట్లాడ్డానికి కుదరలేదు" జరిగింది చెప్పాడు.

"రేపే ఇంటర్వ్యూ. ఏం అడుగుతారో ఏమో" దిగులుగా అంది జయంతి.

"ఆ వాళ్ళ మొహం ఏం అడుగుతారు. అయినా ఇంటర్వ్యూలో అడిగే ప్రశ్నలకి చెప్పే సమాధానాలకి, వచ్చే ఫలితానికి, సంబంధం ఏముంది"

దీప డాడీ దగ్గరకి వచ్చింది

"రేపు అల్లరి చెయ్యకుండా ఉంటావా" దీపని ఒళ్ళో కూర్చోబెట్టుకుని అడిగాడు జగన్.

దీప అతని షర్టుగుండీ విప్పుతోంది

"వన్, టు, త్రీలు నేర్చుకున్నావా"

అవునన్నట్టుగా తలూపింది.

"నేర్పించావా" జయంతి వంక చూస్తూ అడిగాడు జగన్.

"దాని మొహం, దానికి మూడ్ కుదిరితే చెపుతూంది, లేకపోతే అంతే" జగన్ నవ్వాడు

"ఆ పుస్తకం ఇలా ఇయ్యి"

జయంతి బొమ్మల పుస్తకం ఇచ్చింది. "ఇదేమిటి" బొమ్మను చూపిస్తూ అడిగాడు

"పిల్లి" అంది దీప.

"పిల్లి కాదు యాంట్"

"ఆంటీ"

"ఆంటీ కాదు. యాంట్, ఏదీ అను యాంట్"

దీప జగన్ నోటిని చేత్తో మూసింది.

"మండిదానికి తమా, ఈ రోజు రేపు మామాట వినాలి. చక్కగా అన్నీ చెప్పాలి

అలా చేసావంటే బోల్డన్ని బిస్కెట్లు చాక్లెట్లు కొనిస్తాను. అను యాంట్"

దీప అతన్ని వదిలించుకుని ఒళ్ళోంచి దిగింది. తుర్రున లోపలికి పరుగెత్తింది

"ఇదీ దీని వరస" అంది జయంతి

"డోంట్ వర్రీ....పిల్లలందరూ ఇలా ఉంటారు"

"ఏమో వీళ్ళ వరసచూస్తే ఇలాప్పుంది అక్కడ స్కూళ్ళల్లో వీళ్ళని పెద్దవాళ్ళకన్నా ఎక్కువగా అడుగుతున్నారు. పుస్తకాలు, బాక్సులు వీళ్ళకన్నా ఎక్కువ బరువుగా ఉంటున్నాయి. ఏం చదువులో ఏమో" నిట్టూర్చింది జయంతి.

ఇద్దరూ దీపని వెతికి పుచ్చుకున్నారు రేడియోలో రూపకంలా వొకరి తర్వాత వొకరు దాంతో అంకెలు, రంగుల పేర్లు వళ్ళపేర్లు చెప్పించారు. మూడ్ బాగున్నప్పుడు చెప్పి, బాగాలేనప్పుడు మొండికేసి పారిపోతోంది దీప.

రాత్రి తొమ్మిదయింది.

దీప నిద్రపోయింది.


దీపని మధ్యలో పడుకోబెట్టుకుని ఆమె మీద చెయ్యేసి, పడుకున్నారు జగన్ జయంతి. ఆ రాత్రి కలలో రెండుసార్లు ఉలిక్కిపడి లేచింది జయంతి. జగన్ అటు ఇటూ దొర్లుతూ రాత్రినిద్రపోనేలేదు

ం ం ం

ఉదయం పదిగంటలు,

సెయింట్ డాప్లి క్రాస్, లోయల్టీ, నాందిపెయర్ల్ ఎండ్ గ్రామర్ స్కూల్.

పెద్దవాళ్ళతో పిల్లలతో కిక్కిరిసి వుంది




ఆగది. ఆడవాళ్లు మొగవాళ్లు విడివిడిగా, మధ్య మధ్యలో కలిసి కబుర్లు చెప్పుకుంటు న్నారు. ఒకరి వివరాలు మరొకరు తెలుసుకుంటున్నారు. దాన్ని బట్టి యెదుటి వాళ్ళ పిల్లకి సీట్ వచ్చే అవకాశాలు. తమ పిల్లకి సీట్ వచ్చే అవకాశాలు బేరీజు వేసు కుంటున్నారు. ఒక జంట బయటకి వచ్చింది. అతను పిల్లను ఎత్తుకున్నాడు. వాళ్ళచుట్టు గుమిగూడారు అందరూ

"ఏం అడిగారు," అందరూ ముక్త కంఠంతో అడిగారు.

"ఏమీ అడగలేదు," అతను వాళ్ళ మధ్యలోంచి దూసుకుపోయాడు. అతని వెనక విసవిస నడచిపోయింది ఆవిడ

వాళ్లు అక్కడున్న కార్లో ఎక్కారు. ఆ కారు నంబరుప్లేట్ పైన "ప్రభుత్వ వాహ నము" అని రాసుంది.

"ఆయన ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్‌లో సెక్రటరీ. ఐ.ఎ.యస్" అన్నారొకాయన,

"అలాగా అయితే సీటు గ్యారంటీ. అందుకే అంత ధీమా" అనుకున్నారు మిగిలినవాళ్లు.

ఎవరేనా లోపల్నుంచి బయటకు వచ్చి నప్పుడల్లా ఇలా పరామర్శించుకోడం ఏదో కామెంట్ చేసుకోడం సమయం గడుస్తోంది.

"జగన్, జయంతి, బేబీ దీప" అరి చింది ఓ టీచర్.

ఇద్దరూ దీపని తీసుకుని లోపలికెళ్లారు.

"నేను రాను" మారాం చేసింది దీప.

"మంచిదానివి కదూ. అయిదు నిమి షాలు చక్కగా ఉండాలి. చూడు అందరి పిల్లలూ ఎలా ఉన్నారో, నువ్వుకూడా గుడ్ గర్ల్ కదూ పేచీ పెట్టకూడదు" జయంతి దీపని సముదాయించి లోపలికి తీసుకెళ్లింది

లోపల టేబుల్‌కి ఎదురుగా ఉన్న బెంచీ మీద కూర్చున్నారు ఇద్దరూ. మధ్యలో నించుంది దీప. ఆ టేబుల్ ఎక్కడానికి దీప చేస్తున్న పయత్నాన్ని వారిస్తోంది

"వాటీజ్ యువర్ నేమ్ బేబీ" ముద్దుగా అడిగింది మదర్.

తెల్లబోయి చూసింది దీప.

"పేరు చెప్పమ్మా" అంది జయంతి.

"తెలుగులో ఎందుకు అందిస్తున్నారు ఇంగ్లీషు మాటలు నేర్పించటం లేదా" అడిగింది మదర్.

"స్కూల్లో నేర్పుతుంటుంది. ఆఫ్ కోర్స్ ఇంట్లో కూడా చెపుతున్నామను కోండి. అయినా పిల్లలకి స్కూల్లో తప్ప సీరియస్‌నెస్ రాదు" అంది జయంతి,

"ఏమిటీ మీరు ఇంట్లో ఇంగ్లీషులో మాట్లాడుకోరా?"

"లేదు తెలుగులో మాట్లాడుకుంటాం. తెలుగు మా మాతృభాష"

"ఆశ్చర్యంగా ఉందే, చదువుకున్న వాళ్లు కూడా ఇంట్లో తెలుగులో మాట్లాడు కుంటారా?" ఆశ్చర్యపోయిందావిడ.-

"మేము మూడేళ్లు కెనడాలో ఉన్నాం. అక్కడున్నన్ని రోజులు ఇంగ్లీషు విని విని బోర్ కొట్టింది. ఎప్పుడు ఇండియా వెడ తామా. ఎప్పుడు హాయిగా తెలుగులో మాటాడుకుంటామా అనిపించేది. ఇది మేం ఇండియా వచ్చాక పుట్టింది. ఇది పూర్తి ఆంధ్రా అమ్మాయిలా పెరుగుతోంది" జగన్ సర్ది చెప్పాడు.

"ఇంట్లో ఇంగ్లీషులో మాటాడుకోవాలి. లేకపోతే పిల్లలు ఎలా పికప్ చేస్తారు" ఇంకొకావిడ హితబోధ మొదలుపెట్టింది.

వీళ్ళ దృష్టిలో, వీళ్ళేమిటి ఇండియాలో చాలామంది దృష్టిలో చదువు అంటే ఇం గ్లీషులో ధారాళంగా మాటాడ్డం. ఎంత పండితుడైనా, ఎంత పెద్ద శాస్త్రజ్ఞుడైనా, ఇంగ్లీషు సరిగ్గా రాకపోతే "ఉత్త పల్లెటూరి బైతు" అంటారు.

"మీరేం చేస్తారు" మదర్ జగన్‌ని అడిగింది.

"ఇక్కడే ఓ ప్రయివేట్ కంపెనీలో ఇంజనీర్ని"

"ఐ.సి. మీరెక్కడ ఉంటున్నారు"

"టాంక్ బండ్ కింద దోమల్‌గూడాలో"

"టాంక్ బండ్ దగ్గరా అయితే మీకు హైదరాబాద్‌లో ఉన్న సెయింట్ మరియా కాన్వెంట్ స్కూల్ దగ్గరకదా" అక్కడ చేర్చకుండా ఇక్కడికెందుకొచ్చారు. అదీ మంచి కాన్వెంటే కదా?"

'లేదు మదర్ మా యింటికి ఇదే దగ్గర'

"నో, అదే దగ్గర. సికింద్రాబాద్‌లో ఉండేవాళ్ళకే ఇక్కడ సీటు ఇద్దామనుకుం టున్నాం,"

"సారీ ముందు మీరు సీటివ్వండి. అంతగా కావాలంటే మేం సికింద్రాబాద్ మారతాం."

"మీరు ఉండేది అద్దెఇంట్లోనా, సొంత ఇంట్లోనా?"

ఈ ప్రశ్నకి తామిచ్చే సమాధానానికి, సీట్‌కి సంబంధం ఏమిటో అర్థం కాలేదు జయంతికి. అయినా వినాయితీగా 'సొంత ఇంట్లో, అక్కడ మాకు ఓ ఫ్లాట్ ఉంది' అంది.

"అయితే ఇల్లు మారటం ఎందుకు. మీరు హైదరాబాద్ స్కూల్లో ప్రయత్నిం చండి."

. "అదేం కాదు మదర్ - మా ఇంటికి మీ స్కూలే దగ్గర. కావాలంటే దూరాన్ని కొలవండి. మా ఇంటికి మీ స్కూలు మూడు కిలోమీటర్ల ఎనిమిదివందల యార్డ్ మీటరు. సెయింట్ మరియా కాన్వెంట్

మూడు కిలోమీటర ఎనిమిది వందల అరవై మీటరు, కాబట్టి మా ఇంటికి మీ స్కూలే దగ్గర. నమ్మ నమ్మకపోతే టేప్ తీసుకుని కొలుద్దాం రండి" అన్నాడు జగన్. మదర్ ఆశ్చర్యపోయింది.

"సరె. మీ పాప స్కూలుకి ఎలా వస్తుంది"

"రిక్షాలో" అదీ ఓ సమస్యేనా అన్నట్టు అంది జయంతి.

"వాట్. మీరు తీసుకురారా. మా స్కూల్లో చదువుకునే పిల్లల్ని వాళ్ళ అమ్మే తీసుకురావాలి".

"కుదరదు మదర్. నేను కాలేజీకి వెళ్లాలి".

"మీరింకా చదువుకుంటున్నారా"

"లేదు. లెక్చరర్‌గా పని చేస్తున్నాను"

"వ్వాట్. మీరు వర్కింగ్ ఉమెనా. మా స్కూల్లో వర్కింగ్ లేడీస్ పిల్లలకి సీట్ లేదు"

"ఎందుకు" హీనంగా అడిగింది జయంతి.

"ఉద్యోగాలు చేసే ఆడవాళ్లు పిల్లల్ని సరిగ్గా చూడరు. వాళ్ల పిల్లలకి డిసిప్లిన్ సరిగ్గా ఉండదు"

"ఎందుకలా ఊరికే కామెంట్ చేస్తారు. క్రమశిక్షణ అనేది గృహిణి ఉద్యోగం చేస్తుందా లేదా అన్నదానిమీద ఆధారపడి ఉండదు. అసలికి ఇల్లు, పిల్లలు వీటి మీద ఉన్న ఆసక్తి బట్టి ఉంటుంది. నాకు వీటి మీద ఆసక్తి ఉంది. అయినా మీ స్కూల్లో మాత్రం ఆడవాళ్లు ఉద్యోగం చెయ్యటం లేదా. వాళ్ల పిల్లల్ని కూడా మీరు తీసుకోరా"


మా స్కూల్లో పనిచేసే ఆడపిల్లలు పెళ్లి కాని వాళ్లు. పెళ్లయినవాళ్లకి మా స్కూల్లో ఉద్యోగాలివ్వం. కాబట్టి వాళ్లకి పిల్లలుండే ప్రసక్తి లేదు".

జయంతి మాట్లాడలేదు. "ఇది అన్యాయం" అన్న మాటలు అప్రయత్నంగా ఆమె నోటిలోంచి వచ్చాయి

"సోసీ మీ బేబీ డేట్ ఆఫ్ బర్త్ ఏమిటి"

"నవంబర్ ఫస్ట్. 1979" చెప్పింది జయంతి.

"ఓ అయితే ఫస్ట్ సెప్టెంబర్ 1982 నాటికి మీ అమ్మాయికి మూడేళ్లు నిండ




లేదు. రెండు నెలలు తక్కువ. సారీ మీ అమ్మాయికి సీటు ఇవ్వలేం"

"అదేమిటి"

"అవును అంతే. మా రూల్ ప్రకారం సెప్టెంబరు మొదటి తారీఖుకల్లా మూడేళ్లు నిండాలి. మూడున్నరఏళ్ళకిమించకూడదు'

జగన్‌కి అది పజిల్‌లాగా అనిపించింది. ఒక్క క్షణం ఆలోచించి లెక్క కట్టాడు.

"అది అన్యాయం. ఈ ఏడాది పోనీ అనుకుని వచ్చే ఏడాది వచ్చామనుకోండి. మా అమ్మాయికి అప్పుడు మూడేళ్ల పది నెలలు అవుతాయి. అప్పుడు వయసు ఎక్కువైంది అంటారు" అడిగాడు జగన్.

"అవును. అసలు మిమ్మల్ని ఇంటర్వ్యూకి ఎందుకు పిల్చారో తెలియదు. పొరపాటయింది. మిమ్మల్ని ఇంటర్వ్యూకి పిలవకూడదు".

"అదేమిటి మదర్. మీ రూల్ ప్రకారం ఏ ఏడాదిలోనైనా అక్టోబర్ నుండి ఫిబ్రవరి వరకు పుట్టిన పిల్లలు మీ స్కూలులో చేరడానికి లేదు. ఎందుకంటే వారు సెప్టెంబర్ ఒకటో తారీఖు నాటికి మూడేళ్ళకన్నా తక్కువగానైనా ఉంటారు లేదా మూడున్నరకన్నా ఎక్కువగానైనా ఉంటారు".

"మా రూల్ అది. ఇది స్కూల్ పాలసీ. ఇంకోటి మీరు చూస్తే పాతకాలంవారిలా వున్నారు. మా స్కూలులో చదువుకునే ఆడపిల్లలు పువ్వులు పెట్టుకోకూడదు. గాజులు వేసుకోకూడదు. బొట్టు, కాటుక పెట్టుకోకూడదు. మీకు సమ్మతమేనా" అడిగిందావిడ.

"ఈ స్కూల్ వద్దు. వెళదాం రండి" లేచింది జయంతి.

ఆమె వెంట బయటికి వచ్చాడు జగన్. వాచీ చూసుకున్నాడు. పదకొండున్నర. పన్నెండు గంటలకి మరొక ఇంటర్వ్యూ. 'పద' అన్నాడు. ముగ్గురూ స్కూటర్ మీద బయల్దేరారు.

సెయింట్ ఆంబ్రోస్ మెమోరియల్ కాన్వెంట్ స్కూల్.

తన తాతగారైన సీనియర్ అంబరీషుడి ఫోటోకి నమస్కరించి అంబరీషుడు కుర్చీలో కూర్చున్నాడు.


జనకుడు యెదురుగా ఉన్నాడు. వాళ్లిద్దరూ కజిన్స్.

పక్క హాలులోంచి పెద్దవారి మాటలు. పిల్లల ఆటలు వినిపిస్తున్నాయి.

యెవరో కుర్రాడు విసిరిన బంతి తగిలి ఓ కిటికీ అద్దం పగిలిపోయిందట. అప్పుడే ఓ పిల్లి హాలులో............ హాలు పాడు చేసింది. వాళమ్మ దాంతో అవస్థ పడుతోంది. ప్యూన్ ఇవన్నీ అంబరీషుడికి చెపుతున్నాడు

"ఛి ఛి ఏమిటా పిల్లకాకుల గోల. ఈ ఇంటర్వ్యూలు ఈ గొడవ ఎందుకు, మనక్కావలసిందేదో చెపితేపోలా" అంబరీషుడు విసుక్కున్నాడు.

"అమ్మమ్మ. అలా అంటే యెలా పేరు నిలుపు దానికుంది. షో ఉండద్దూ. నువ్వు పుట్టగానే అంబరీష పాఠశాల అని పెట్టావు ఎవరెన్నా తమ పిల్లల్ని




చేర్పించారా లేదు. కారణం అది తెలుగు పేరు. ఆ తర్వాత దాన్ని ఆంబ్రోస్ మెమోరియల్ స్కూల్ అనిపెట్టావు. వొక్కసారి రష్ పెరిగింది. నీ స్కూల్లో సీటు ధర వందవందలయింది. ఈ ఏడాది దాన్ని సెయింట్ ఆంబ్రోస్ మెమోరియల్ కాన్వెంట్ స్కూల్ అని మార్చా, మన స్కూల్లో సీటుధర వెయ్యిరూపాయలు పలుకుతోంది, చూడు "సెయింట్" అన్న పదానికి ఎంత విలువ వుందో"

"కాదు నాస్కూల్ స్టాండర్డ్‌కి ఉన్న విలువ అది"

"గాడిదగుడ్డు, అన్ని స్కూళ్ళకి ఉన్న స్టాండర్డ్ వొకటే. ఏ స్కూలికి పేరుండి తెలివైన పిల్లలు చేర్తారో ఆ స్కూల్ రిజల్ట్సు బాగా వస్తాయి. ఆ ఖ్యాతి పిల్లలకి దక్కాలి గాని స్కూల్‌కి కాదు. ఇప్పుడు నీ స్కూల్‌కి ఇంత గిరాకీ పెరిగిందంటే కారణం నా సలహా ప్రకారం నువ్వు పేరు మార్చడమే. 'సిల్‌సిలా' సినిమా చూడండి. అసలానికి, అమితాబచ్చన్ నటించిన "సిల్‌సిలా" చూడండి అన డానికి తేడా లేదూ. సినిమా వొకటే అయినా అమితాబ్ పేరు చెబితే చాలు, రెండు వారాలపాటు అన్ని సెంటర్లలో టిక్కట్లు బుక్ అయిపోతాయి. కారణం హీరోవర్షిప్. అలాగే స్కూలు ఒకటే అయినా స్కూలు పేర్లో కొన్ని పదాలకి ఇలాంటి వర్షిప్ ఉంది. ఏ స్కూలు చివరైనా కాన్వెంట్ స్కూల్, పబ్లిక్ స్కూల్, కిండర్ గార్డెన్ స్కూల్ అవి తగిలిస్తే చాలు దాని విలువ రెట్టింపు అవుతుంది. అలాగే పేరుకి ముందు సెయింట్ అన్న పేరు తగిలిస్తే దాని విలువ ఐదురెట్లు పెరుగుతుంది. అమితాబ్‌కున్న హీరో వర్షిప్ ఉంది. సెయింట్ అన్నపదానికి, దాన్ని నడిపేది నిజమైన సన్యాసులా లేక దొంగ సన్యాసులా అనికూడా ఎవరూ చూడరు"

"సరే నీ వాదనని అంగీకరించాం. నీ సలహాకి కృతజ్ఞతలు. ఈ ఇంటర్వ్యూల తలనొప్పి నేను పడలేను. ఓ పని చేద్దాం అందరికీ ఓ తెల్లకాగితం ఇద్దాం. దాని మీద ఎవరికి వారే పిల్ల లేక పిల్లాడిపేరు అడ్రసు. తము ఇవ్వగల మాగ్జిమమ్ డొనేషన్ - ఈ వివరాలురాసి ఈడబ్బాలో పడెయ్యమందాం. అందర్లోకి యెక్కువ డొనేషన్ ఇచ్చిన వాళ్ళకి మొదటిసీటు. ఆ తర్వాత వాళ్ళకి రెండోది. ఆ తర్వాత మూడోది అలా అన్ని సీట్లు పూర్తిచేద్దాం. ఇలా చేస్తే పోలే? వాళ్ళకి మనకి ఈ తల నొప్పి యెందుకు?"

"అదే పొరపాటు అంబరీషా. మనం యెలాగూ చివరికి చేసేది అదే. కాని అంత బాహాటంగా చెయ్యకూడదు. పైగా మనస్కూల్లో సీటు రావడం తేలిక అని యెవ్వరికీ అనిపించకూడదు. అందువల్ల పిల్లల్ని, వాళ్ళ తల్లిదండ్రుల్ని, అమ్మమ్మని, నాయనమ్మని, చచ్చి స్వర్గంలో ఉన్న తాత ముత్తాతల్ని అందర్నీ పిలిచి ఇంటర్వ్యూ చెయ్యాలి. పిచ్చి పిచ్చి ప్రశ్నలన్నీ వెయ్యాలి. ఇక్కడ సీటు తెచ్చుకోడం సామాన్యం కాదు అనిపించేలా చెయ్యాలి. అలా చేసామంటే, నా సామిరంగా మనసీటు ధర పదిహేనువందలకి పెరుగుతుంది. అంతేకాదు, అప్లికేషన్ ఫారంని కూడా బ్లాక్‌లో పాతిక రూపాయలకి అమ్మచ్చు" జనకుడు బోధిస్తున్నాడు.

"సరేకాని పిలుద్దామా" జనకుడు దాటికి తట్టుకోలేక అడిగాడు అంబరీషుడు.

"అంత తొందరైతే యెలా, వేషం మారదూ, మనం ఇద్దరం తెల్ల గౌన్లు వేసుకోవాలి. నీ పేరు అంబరీషుడు కాదు బ్రదర్ ఆంబ్రోస్- నాపేరు జనకుడు కాదు బ్రదర్ జాన్. చూడు ఇంటర్వ్యూలు యెలా చేస్తానో వచ్చే సంవత్సరం సీటు ధర పదిహేనువందలు కాకపోతే అడుగు. అన్నట్టు ఆంబ్రోస్ నువ్వు పొరపాటున నోరు జారి డొనేషన్ అన్నావో మన పని గోవిందా. డొనేషన్ తీసుకోకూడదని గవర్నమెంట్ జి.ఓ ఉంది. అఫ్‌కోర్స్ జి.వోని యెవడూ ఖాతరు చెయ్యడనుకో, కట్నం తీసుకోడం నేరం అని రూల్ ఉన్నా కట్నం లేందే పెళ్ళిళ్ళు యెలా అవడం లేదో, డొనేషన్లు తీసుకోడం తప్పు అని జి.ఓ ఉన్నా డొనేషన్ లేందే సీటు యెవరూ ఇవ్వటం లేదు. అయినా మన జాగ్రత్తలో మనం ఉండాలి. ఈ రోజుల్లో కట్నం అని యెవరూ అనటం లేదు. ప్రజంటేషన్ అంటున్నారు. అలాగే మనంకూడా తీసుకునేదాన్ని డొనేషన్ అనద్దు. "బిల్డింగ్ ఫండ్" అందాం ఒ.కె.?"

అంబరీషుడు తల వూపాడు.

"జగన్, జయంతి, దీప" పిల్చారు.

ముగ్గురూ లోపలికి వచ్చారు. తెల్ల గౌను వేసుకున్న ఇద్దర్నీ చూసారు.

"వాటీజ్ యువర్ నేం బేబీ" అడిగాడు జనకుడు.

మంచి యెండగాఉండేమో దీపనిద్రపోడం మొదలెట్టింది. ఆమె కళ్ళు మూసుకుపోతున్నాయి. జయంతి దీపని లేపింది.

"పర్వాలేదు. నిద్రపోనీండి" అన్నాడు అంబరీషుడు.

జనకుడికి కోపం వచ్చింది. ఈలోగా దీప లేచింది.

"నీపేరు చెప్పమ్మా" అంబరీషుడు తెలుగులో అడిగాడు.

"చెప్పను" దీప కుర్చీలోంచి దిగి గదిలోంచి బయటకు వెళ్ళబోయింది. ఆమె వెంట పడి పట్టుకున్నాడు జగన్.

"పోనీండి. మీరెక్కడుంటారు?"

"దోమల్‌గూడాలో. మీ స్కూలు పక్కనే ఇలు చూసుకుంటున్నాం"

"ఒ. కె. గుడ్" అన్నాడు అంబరీషుడు.

"మీరు కూడా ఉద్యోగం చేస్తున్నారా" జయంతిని అడిగాడు జనకుడు. నిజం చెప్పి ఒకసారి దెబ్బ తిందేమో "లేదు" అని అబద్ధం చెప్పింది.

"లేదూ? మా స్కూలో చదివే పిల్లల తల్లులు కూడా ఉద్యోగం చేస్తే బాగుంటుందని మా ఉద్దేశం. ఎందుకంటే ఇక్కడ ఫీజులు ఎక్కువ. అదిగాక చిల్డ్రిన్స్ డే, టీచర్స్ డే, మదర్స్ డే, ఫాదర్స్ డే, బ్రదర్స్ డే - ఇలా నెలకో యాక్టివిటీ చేస్తాం. అలా పెట్టినప్పుడల్లా పాతిక రూపాయల టిక్కటు కనీసం రెండైనా కొనాలి. అదిగాక ఆరునెలల కొకసారి సావనీర్ తీస్తాం. అలా తీసినప్పుడల్లా ఓ అడ్వర్టయిజ్‌మెంట్ ఇప్పించాలి. లేకపోతే సావనీర్ ఫండ్‌కి కొంత కంట్రిబ్యూషన్ ఇవ్వాలి, ఈ రోజుల్లో ఎంత సంపాదించినా ఒక జీతంతో నెగ్గడం కష్టం. అందువల ఇద్దరూ పనిచేస్తే పిల్లల మీద కాస్త యెక్కువ ఖర్చుపెట్టిబాగా పెంచవచ్చు"

ఖర్చు విషయంలో పర్వాలేదు 'భరించగలం' అన్నాడు జగన్.

ఆ ఇద్దరి ముఖం విప్పారింది.

"మా స్కూలో మీ అమ్మాయి చదవుకోడానికి ఇంకా మంచి కాసురూం కట్టిస్తాం. అందువల ఇప్పుడు చేరబోయే పిల్లల దగ్గర్నుంచీ బిల్డింగ్ ఫండ్‌కి చందాలు తీసుకుంటున్నాం. ఓ రెండువేలు వెయ్యగలరా" అడిగాడు బ్రదర్ జాన్ వేషంలో ఉన్న జనకుడు.

జగన్‌కి గుండె ఆగిపోయింది. తాను మొత్తం ఇంజినీరింగ్‌కి రెండువేలు ఖర్చు పెట్టలేదు. తన కూతురు స్కూలో చేరగానికే రెండువేలు ఖర్చు. ఇంకా యెంత ఖర్చౌందో

ఆ మాటలు విన్న జయంతి గుండె ఆగిపోయింది. ఇదంతా దోపిడీలా ఉంది.

"నడవండి" అంది.

ముగ్గురూ బయటకొచ్చారు.

"ఈ ప్రయివేట్ స్కూల్స్ ఎందుకు. హాయిగా గవర్నమెంట్ స్కూల్‌కి పోదాం అక్కడే చేర్పిద్దాం. మనం చిన్నప్పుడు గవర్నమెంటు స్కూలో చదువుకోలేదూ, రండి" అంది జయంతి.

"గవర్నమెంటు స్కూల్లో వద్దు జయా నీకు తెలియదు" అన్నాడు జగన్. జయంతి వినిపించుకోలేదు. ఇద్దరూ దార్లో ఓ గవర్నమెంటు స్కూల్‌కి వెళ్లారు.

"ప్రభుత్వ పాఠశాల" అని ఉంది ఆ బోర్డులో. మొదట ఉండవలసిన "ప్ర", చివర ఉండవలసిన "ల" కాలగర్భంలో తుడిచిపెట్టుకుపోయాయి. ఆ బోర్డు చెదలు పట్టి ఊడిపోవడానికి సిద్ధంగా ఉంది. ఆ స్కూల్‌కి గేటు లేదు. లోపలికెళ్లారు. అక్కడ పిల్లలు గోలీలాడుకుంటున్నారు. ఓ ఇద్దరు కుర్రాళ్లు సిగరెట్ కాలుస్తున్నారు "టీచర్" అనే ప్రాణి జాడ అక్కడ కనిపించటం లేదు. చేపల బజారులా ఉంది ఆ స్కూల్.

వరండాలో అడుగుపెట్టిన జయంతి అక్కడ కొడుతున్న కంపుని భరించలేకపోయింది. ఒక చిన్న మట్టిపెళ్ల రాలి పక్కనే పడడంతో తలెత్తి పైకిచూసింది. పై కప్పుమీద పెంకుల్ని మోసే చెక్కలు పుచ్చిపోయి బీటలు గీసి ఏ క్షణంలోనేనా కింద పడ్డానికి సిద్ధంగా వున్నాయి. ఏ నిమిషంలో నేనా కూలిపోడానికి సిద్ధంగా వుంది ఆ కప్పు.

"హెడ్మాస్టర్ని కలుద్దామా" అన్నాడు జగన్.

"వద్దు" అంది జయంతి భయంగా

పట్నాలలో గవర్నమెంటు స్కూళ్ళలో పిల్లల్ని చేర్చడానికి అందరూ ఎందుకు భయపడ్తారో ఇప్పుడు అర్థం అయింది జయంతికి. తను చదువుకున్నప్పటి స్కూళ్ళకి ఇప్పటి స్కూళ్ళకి ఎంత తేడా. కాలగమనంతో అభివృద్ధి రావల్సింది పోయి ప్రభుత్వ స్కూళ్ళ నిర్వహణ ఎందుకు దిగజారుతోంది.

దీపని ఎత్తుకుని బయటకు వచ్చింది జయంతి.

"ఇంటికి పోదాం" అంది. ఆమె ముఖంలో సీరియస్‌నెస్ చూసి ఏమనడానికీ లేక 'సరె' అంటూ స్కూటరెక్కాడు జగన్.

స్కూటర్ ఇంటిముందు ఆగింది.

జయంతి ఆలోచిస్తోంది. తనయితే అలా వచ్చేసింది కాని వాళ్ళు చెప్పినవాటికన్నీ తలూపి, అడిగినంత డొనేషన్ కట్టి పిల్లల్ని స్కూళ్ళలో చేర్చే తల్లి తండ్రులు ఎందరు లేరు.

విద్యతో వ్యాపారం చెయ్యడానికి ఇంత అవకాశం ఉన్నప్పుడు, గవర్నమెంటు స్కూళ్ళని అధ్వాన్నంగా నిర్వహిస్తూ పరోక్షంగా ప్రయివేటు స్కూళ్ళ దోపిడీకి ప్రభుత్వం సహాయ పడుతున్నప్పుడు అవకాశం ఉన్న వాళ్ళు ఎందుకు ఊరుకుంటారు. ఒక్క సీటుకి రెండు వేలు. తను నెలంతా కష్ట పడ్డా అంత డబ్బురాదు. "ఏమండీ నాకో ఆలోచన వస్తోంది" ఉన్నట్టుండి అంది జయంతి.

ఏమిటి అన్నట్టు చూసాడు జగన్.

"మనిద్దరం ఉద్యోగం మానేసి ఓ స్కూల్ పెడదాం"

జగన్ నవ్వాడు.

"నవ్వులాటకి కాదు, సీరియస్‌గా చెపుతున్నాను. ఎవరో ఒక మంత్రి గార్ని పట్టుకోండి మనమూ ఓ స్కూలు పెడదాం" అంది జయంతి.

జగన్ ఆలోచిస్తున్నాడు. ఇలా ఎన్ని స్కూళ్ళు తిరుగుతారు. ఎక్కడ కెళ్ళినా ఒకటే పాట. వేలలో పోయే వేలం పాట. అక్కడే రెండు వేలు కట్టేసి దీపని లోయర్ కెజి అనే బాలశిక్షలో చేరిపిస్తే పీడా పోలేదూ.

బాలశిక్ష - శిక్ష ఎవరికి? ★

(ఈ కథని ఏమాత్రం, ఎవర్ని, ఏ సంస్థనీ, వ్యక్తులనీ, మతాలనీ ప్రత్యేకించి ఉద్దేశించినది కాదని నామనవి.)